


# మెరిసే నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## లేఖ



ముఖ్యమంత్రి గారికి

ఇటీవల దినపత్రికల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీద మేధావుల సూచనలు, సలహాలు అడిగారని తెలుసుకున్నాక ఈ ఉత్తరం రాస్తున్నాను. నేనూ ఒకప్పుడు డబ్బుకి ఇబ్బంది పడిన వాడినే. అయితే ఈ క్రింది పద్ధతుల్ని పాటించి నా ఆర్థిక స్తోమతని పెంచుకున్నాను. ఇవి మీకు కొత్త దారులకు ఇన్స్పిరేషన్ అయితే నాకంతకంటే సంతోషం ఇంకోటిలేదు

**మొదటి పద్ధతి**

ఆదాయాన్ని మించి ఖర్చుచేయాలి. కిరాణా దుకాణంలో మనం పదిహేను వందల రూపాయలు అప్పుంటే మిగిలిన వాళ్ళకన్నా మనల్ని వాడు గౌరవంగా చూస్తాడు, ఆ పరిస్థితుల్లో మనల్ని చూసిన తోటి కస్టమర్ కూడా మన గురించి గొప్పగా అనుకుంటాడు. దీనివల్ల అలాంటి కస్టమర్స్ నుంచి కూడా మనకి అప్పుపుడుతుంది.

**రెండో పద్ధతి**

బేంక్ లో మన డబ్బు వుండేకంటే, మన దగ్గర బేంక్ డబ్బు ఉండడం మెరుగు. ఈ ఓవర్ డ్రాఫ్టు వల్ల బేంక్ మేనేజర్కి మనమంటే శ్రద్ధ పెరుగుతుంది. మనం ఏం పనిచేస్తాం. ఎంతొస్తుంది, ఎంత ఖర్చు చేస్తాం, మన అలవాట్లేమిటి లాంటివన్నీ వివరంగా మన చుట్టుపక్కల వాళ్ళని వాకబుచేస్తాడు.

**మూడో పద్ధతి**

మనం బాకీ వున్న వాళ్ళు ఎదురు పడితే చిరునవ్వుతో సిగరెట్ ముట్టించుకుని చెప్పాలి 'అయ్యా! నేను కాల్చేది తమరి డబ్బునే' అని.

ఇంకేం మాట్లాడాలో వారికి అర్థం కాదు. అప్పుడు మనం చల్లగా జారుకోవచ్చు.

**నాలుగో పద్ధతి**

మనం అసలు మన దగ్గర డబ్బే వుంచుకోకూడదు. గర్ల్‌ఫ్రెండ్స్‌కి గిఫ్టులు కొనివ్వాలి. ఫైవ్ స్టార్ హోటల్స్‌లోనే భోజనం చేయాలి. సూట్లు, బూట్లు అవసరానికి మించి కొనాలి. దాంతో ఎవరూ మన నించి బలవంతంగా డబ్బు తీసుకెళ్ళలేరు.- ఖర్చయిపోయింది కాబట్టి.

**అయిదో పద్ధతి**

వీలైనన్ని క్రెడిట్ కార్డులకి అప్లయ్ చేసి వాటిని ఉపయోగించి సమస్తం కొనండి. విమానం టిక్కెట్లు, హాలిడే రిసార్ట్‌లో హోటల్ బిల్లు, అన్నీ క్రెడిట్ కార్డుతో చెల్లించండి. ఆనక అవి పోయాయని క్రెడిట్ కార్డ్ కంపెనీకి రిజిస్టర్డ్ లెటర్ రాయండి.

***భవదీయుడు***

***రుద్రయ్య***

షరా: మీరు నన్ను స్వయంగా సంప్రదించదలిస్తే, విజిటింగ్ టైమ్‌లో చంచల్ గూడ జైలుకి రండి. ప్రిజన్ నంబర్ 420 అని అడగండి చాలు.

## ఆకాశవాణి... అశరీరవాణి

యర్రంశెట్టి శాయి

ఓ వూళ్ళో కొత్తగా రేడియో స్టేషన్ తెరిచారు. ఓ అధికారి స్టేషన్ ప్రారంభోత్సవం చేస్తూ సభలో రేడియో గురించీ, దాని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడి గురించీ పొగుడుతూ చెప్పాడు.

ముందు వరుసలో కూర్చున్న ఒక శ్రోత లేచి నుంచుని కోపంగా అడిగాడు.

"మీరు చెప్పిన మేధావి కన్నా మరో గొప్ప మేధావి గురించి చెప్పడం మరిచిపోయారు!"

"ఎవరది?"

"దాని నోరు మూయించే స్విచ్ కనిపెట్టినాయన!"



ట్రంక్ రోడ్ మీద జరిగిన కారు ప్రమాదం గురించి రేడియో

"..జరిగిన కారు ప్రమాదంలో ఒక వ్యక్తికి కనీసం రెండు కాళ్ళయినా విరిగి వుంటాయని అంటున్నారు!"



బస్ స్టాప్‌లో గంటసేపు నిలబడ్డాక రామనాధానికి బస్ దొరికింది. తీరా బస్సెక్కాక "అరరే! కండక్టర్ బస్సాపు! నేను దిగిపోవాలి" అన్నాడతను కంగారుగా.

"ఎందుకు? ఏమైంది?" అడిగాడు కండక్టర్ పకుండానే.

"ఇంట్లో రేడియో కట్టేయడం మర్చి పోయానయ్యా! త్వరగా ఆపు! నీకు పుణ్యం వుంటుంది.." అన్నాడతను బ్రతిమాలుతూ.

"సాయంత్రం వరకూ వాగినా దానికి కరెంటేమంత ఎక్కువ కాలదు లేవయ్యా" ఎవరో వెనకనుంచి అన్నారు.

"కరెంట్ కోసం కాదయ్యా ఈ బాధ! రేడియో దగ్గరే మా కుక్కని కట్టేశాను. సాయంత్రం వరకూ ప్రోగ్రాములు విందంటే ఇంకేం బ్రతుకుందది!" కన్నీళ్ళు పెట్టుకుంటూ అన్నాడు రామనాథం.

బస్ సడెన్ బ్రేకుతో ఆగిపోయింది.



"రేడియో కంటే టెలివిజన్ గొప్పది కదూ?"

"అవును! రేడియోలో పిచ్చి వాగుడు వినేవాళ్ళం! టెలివిజన్‌లో అది చూడవచ్చుకూడా."



హఠాత్తుగా రేడియోలో ప్రోగ్రామ్స్ అన్నీ ఆపి వార్తాప్రసారం చేశారు.

ఆకాశవాణి అతి ముఖ్యమైన వార్త వినండి..

చంద్రమండలం హఠాత్తుగా తన కక్ష్య వదిలి భూమివేపు అతి వేగంగా ప్రయాణిస్తోంది. షుమారు రెండు గంటల కాలంలో అదిభూమిని ఢీ కొంటుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు - ఆ తాకిడికి భూమి పూర్తిగా తునాతునకలయి విడిపోతుంది. మిగతా వార్తలువినేముందు ఈ వ్యాపారం సందేశం వినండి..

'టింగ్..టింగ్..నేడే కొనండి! రాజ్ విమల్ వారి అప్పడాలు ..కరకర లాడుతూ కరిగిపోయే రాజ్ విమల్ వారి అప్పడాలు ఇప్పుడు అన్ని సైజుల్లోనూ దేశం నలుమూలలా లభిస్తున్నాయ్ - నేడే వాడండి..రాజ్ విమల్ వారి అప్పడాలు..టింగ్.. టింగ్.."

## చౌ చౌ

"ఒరే లంబూ ఎవరైనా మంచి డాక్టరెవరైనా ఉంటే చెప్పు ఒంట్లో బాలేదు.."

"ఓ తప్పని సరిగా మా ఫేమిలీ డాక్టర్ కొండా రెడ్డి గారి దగ్గరకెళ్ళు"

" నిజంగా బాగా చూస్తారంటావా?"

మరి..! నా దగ్గు తగ్గడానికి గత ఐదు సంవత్సరాలుగా ప్రతి వారం వెళుతున్నాను ఆయన వద్దకే. నేనేం పిచ్చి వెధవననుకున్నావా?"

***

బుడుగు వాళ్ళ నాన్నతో కలిసి స్విమ్మింగ్ పూల్ లో ఈత నేర్చుకుంటున్నాడు..

"నాన్నా .ఇంకొంచెం లోపలికి వెళ్ళనా?"

"వద్దురా బుడుగూ..అక్కడ లోతెక్కువ మునిగిపోయే ప్రమాదం వుంది..'

"లేదులే నాన్నా..నేను బాగా నే ఈదగలను కదా..'

"సరే..మునిగిపోయావంటే..ఇక చూస్కో ఇంటికొచ్చాక చావ తంతాను.."

***

కుక్కుటేశ్వర్ పరీక్షహాల్లో ఏమీ రాయకుండా దిక్కులు చూస్తున్నాడు..ఇన్విజిలేటర్ వచ్చాడు..

"ఏరా..కుక్కూ సమాధానాలు రాయకుండా అటూ ఇటూ చూస్తున్నావేం?"

" ఈ క్రింది ప్రశ్నలకు అయిదింటికి సమాధానాలు వ్రాయుము అని వుందండీ. ఇంకా టైమ్ అయిదు కాలేదు కదండీ.. అందుకే.."

***

"బుడుగూ..పెద్దయ్యాక ఏం చేద్దామనుకుంటున్నావ్?"

"టీచర్ ఔతాను టీచర్.."

"గుడ్ బాయ్..ఎందుకనో చెప్పగలవా?"

"టీచరైతే ఎంచక్కా అప్పుడు ఏమీ నేర్చుకోనవసరంలేదు... ఏమి తెలీకపోయినా పిల్లలని అడిగి తెలుసుకోవచ్చు.."

***

"ఇదో సర్వర్..రెండు ప్లేట్లు మైసూర్ బజ్జీ తీస్కురా.."

"అలానే సార్.."

"ఇదో ఒక్క మాట..మరీ వేడిగా ఉండొద్దు. అలాగని చల్లగానూ వుండొద్దు. శెనగపిండి ఎక్కువొద్దు. తోలు మరీ పల్చగా ఉండొద్దు."

"మరి ఇంతకీ లోపల మైసూర్ ఉండాలంటారా? అదికూడా వద్దా?"

***

పెంపుడు జంతువులు అమ్మే ఒక దుకాణానికి వెళ్ళి ముడొందల బొద్దింకలు,ఇరవై సాలీడ్లు, ఆరు ఎలకలు, ఆరు ఎలుకపిల్లలు, రెండు పిల్లులు అడిగాడు జంబులింగం.

" మేము ఎలుకలు, పిల్లులు మాత్రమే ఇవ్వగలం. మిగతావి మావద్ద లేవు. ఐనా అవన్నీ మీరేం చేసుకుంటారు?"

"ఈ రోజు మా ఇంటి వోనర్ నన్ను ఖాళీ చెయ్యమని అడిగాడు. నేను అద్దెకి దిగినప్పుడు యిల్లు ఎలా వుందో అలానే అప్పజెప్పమని అడిగాడు. అందుకని..." జంబులింగం జవాబు.!

***